క్లుప్తంగా

తుది దశకు చేరుకున్న వరినాట్లు



తోట్లవల్లూరు: వరినాట్లు తుదిదశకు చేరుకున్నాయి. నిన్న, మొన్నటి వరకు సాగునీటి కొరతతో ఇబ్బందులు పడిన రైతులకు కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలు ఊరటనిచ్చాయి. వర్షాలు ఎడతెరపి లేకుండా కురుస్తుండటంతో రైతులు పొలాలను దమ్ము చేయించి వరినాట్లు వేయిస్తున్నారు. మండల వ్యాప్తంగా మరో రెండు మూడు రోజుల్లో వరినాట్లు పూర్తయ్యే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. పల్లపు పొలాల రైతులు తమ వరి పొలాల్లోని వర్షం నీటిని బయటకు పంపే పనిలో ఉండగా, మెరక ప్రాంత రైతులు ఎరువులు పిచికారీ చేసే పనిలో నిమగ్నమయ్యారు.

కైకాలకు ఘన నివాళులు




గుడివాడ టౌన్: ప్రముఖ సినీ నటుడు, బందరు పార్లమెంట్ మాజీ సభ్యుడు కైకాల సత్యన్నారాయణ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం వద్ద గల కైకాల సత్యనారాయణ విగ్రహానికి కాపు సేవా సమితి నాయకులు, అభిమానులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సేవాసమితి అధ్యక్షుడు ఎస్. ప్రసాదు, కార్యదర్శి మల్లేశ్వరరావు, పూర్వ అధ్యక్షులు పి. రామకృష్ణ, సుంకర గాంధి, బి. నోబుల్ నాయుడు, పి. వెంకట్, పి. నాగ మల్లేశ్వరరావు, ఎస్. గాంధి, వి. అప్పారావు, ఎల్. రామకృష్ణ, వంగా వంశీ, కె. సూర్యనారాయణ, నాగేశ్వరరావు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్యశిబిరం




గుడివాడ టౌన్: స్థానిక మెయిన్‌రోడ్ లోని పశు వైద్యశాలలో శుక్రవారం మెగా ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి డెప్యూటీ డైరెక్టర్ పి. రత్నశ్రీ మాట్లాడుతూ ఎదకురాని, తిరగపొర్ల పశువులకు ఇక్కడ పరీక్షలు నిర్వహించామన్నారు. వాటి ఆరోగ్య పరిస్థితులను బట్టి అవసరమైన వాటికి మందులు పంపిణీ చేశామన్నారు. శిబిరంలోనే కాకుండా ఇతర సమయాల్లో కూడా ఈ విధమైన పరీక్షలు నిర్వహిస్తామన్నారు. పరిసర ప్రాంత పశుపోషకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆస్పత్రి సహాయ సంచాలకులు డాక్టర్ పి. శ్రీనివాసరావు, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రాజశేఖరరెడ్డి, డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ రామకృష్ణ, సిబ్బంది వీరవెంకమ్మ, ప్రసాదు, సాయి స్వాతి, నాగేంద్ర, మౌనిక, పూర్ణచంద్రరావు, దినేష్ పాల్గొన్నారు.

విఘ్నేశ్వర స్వామి ఆలయానికి వితరణ



గుడివాడ టౌన్: స్థానిక మెయిన్ రోడ్డులో వేంచేసియున్న శ్రీ విఘ్నేశ్వర స్వామి ఆలయంలోని విగ్రహాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసేందుకు భక్తులు వితరణ ఇచ్చినట్లు ఆలయ ఈఓ వై. శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. పట్టణానికి చెందిన వక్తారామ్–శాంతాదేవి దంపతులు రూ. 10,116, భంరా రామ్–దీవా దేవి దంపతులు రూ. 10,116 అందజేసినట్లు పేర్కొన్నారు.

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



కైకలూరు: శ్రావణమాసం మొదటి శుక్రవార పూజలను పలు దేవాలయాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం మహిళా భక్తులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. కైకలూరు శ్యామలాంబ అమ్మవారి దేవస్థానంలో మహిళలు దర్శనానికి బారులు తీరారు. పూల ఆదినారాయణ అమ్మవారికి పూల అలంకరణ చేయించారు. అమిరపు వెంకట సూర్య అప్పారావు, సుబ్బారావు సోదరులు, ఇందుకూరి వెంకట రామరాజు, నిమ్మల రమేష్ తదితరులు భక్తులకు ప్రసాదం అందించారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ వీఎన్‌కే శేఖర్ పర్యవేక్షించారు.

పొంచి ఉన్న ప్రమాదం

- బుడమేరుకు పెరుగుతున్న వరద ఉధృతి
- మరో మూడురోజుల పాటు వర్షం సూచన
- బుడమేరు పరివాహక గ్రామాల ప్రజల ఆందోళన



ఇలపర్రు గ్రామం వద్ద పంట పొలాల సమీపంలో ప్రవహిస్తున్న బుడమేరు

గుడివాడరూరల్: అల్పపీడనం కారణంగా కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు, ప్రజల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. నందివాడ మండలంలోని ప్రధానమైన బుడమేరు, చంద్రయ్య డ్రెయిన్ల ప్రవాహానికి మించి ప్రవహిస్తుండటంతో పరివాహక ప్రాంతాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ముఖ్యంగా బుడమేరు పరివాహక గ్రామాలైన పుట్టగుంట, పెదలింగాల, చినలింగాల, చేదుర్తిపాడు, రామాపురం, అరిపిరాల, కుదరవల్లి గ్రామాల పరిధిలోని పరివాహక ప్రాంతాల్లో ఖరీఫ్ సీజన్‌కు గాను సుమారు నాలుగు వేల ఎకరాలకు పైగా ఇప్పటికే వరినాట్లు వేశారు. సుమారుగా ఎకరాకు రూ.15వేలకు పైగా రైతులు ఖర్చు చేశారు. అల్పపీడనం కారణంగా వర్షాలు ఎడతెరపి లేకుండా కురుస్తుండటంతో పాటు ఎగువ నుంచి బుడమేరుకు రోజురోజుకు ప్రవాహం పెరుగుతోంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

రైతులకు కష్టాలు

మరికొన్ని రోజులు వర్షాలు కురుస్తాయని ఇప్పటికే వాతావరణశాఖ ప్రకటించిన నేపథ్యంలో గత ఏడాది ఖరీఫ్ సీజన్ మాదిరిగానే మళ్లీ నాట్లు ముంపునకు గురై నష్టపోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. పంటలను కాపాడుకునేందుకు పగలు, రాత్రి తేడా లేకుండా పొలాల్లో ఉన్న నీటిని తరలించే ప్రయత్నంలో అష్టకష్టాలు పడ్డామని అన్నదాతలు పేర్కొంటున్నారు.

చర్యలు శూన్యం

వర్షాలు కురుస్తున్నా ఇప్పటికీ ప్రభుత్వం మురుగునీటి పారుదలకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. కాల్వలు, డ్రెయిన్లలో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న గుర్రపుడెక్క, తూడు తొలగింపు బాధ్యతలను నీటి సంఘాలకు అప్పగించినా ఆ దిశగా పనులు జరిగిన దాఖలాలు లేవు. పోలుకొండ వద్ద ఉన్న రెగ్యులేటర్ శిథిలావస్థకు చేరి షట్టర్లు పని చేయకపోయినా కూటమి ప్రభుత్వం మరమ్మతులకు పైసా కేటాయించలేదు. ఫలితంగా ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఎగువ నుంచి వస్తున్న నీరు దిగువకు సక్రమంగా వెళ్లకపోవడం వలన వేలాది ఎకరాలు ముంపునకు గురయ్యే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు కళ్లు తెరచి నీటి ప్రవాహం సక్రమంగా సాగేలా చర్యలు చేపట్టాలని రైతులు వేడుకుంటున్నారు.

ప్రభుత్వ వైఫల్యం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే బుడమేరు రూపంలో పెను ముప్పు ఏర్పడి పలు గ్రామాలు ముంపునకు గురై విజయవాడ వంటి మహానగరంతో పాటు బుడమేరు పరివాహక ప్రాంతాల్లోని గ్రామాలు రోజుల తరబడి వరదనీటిలో మునిగి భారీ ఆస్తినష్టం సంభవించిన విషయం తెలిసిందే. అప్పట్లో రైతులు వేసిన వరినాట్లు సైతం పూర్తిగా తుడిచిపెట్టుకుపోయి రైతులకు తీవ్ర నష్టాన్ని కలుగచేశాయి. అప్పట్లో సీఎం చంద్రబాబునాయుడు పర్యటించి బుడమేరు ప్రక్షాళన చేస్తామని మాట ఇచ్చారు. కూటమి ప్రభుత్వం పాలన ఏర్పడి ఏడాది గడిచినా బుడమేరు ప్రక్షాళన ఊసేలేకుండా పోయింది. ప్రభుత్వ వైఫల్యమే మళ్లీ అల్పపీడన రూపంలో ప్రజలు, రైతన్నలను మళ్లీ నట్టేటముంచేలా ఉండటంతో వారు ఆందోళన చెందుతున్నారు.

పంట పొలాలను కాపాడండి



గడిచిన ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఎకరాకు రూ.25వేలకు పైగా ఖర్చు పెట్టి నాట్లు వేసి మందులు పిచికారీ చేశాం. పొట్ట దశలో పంట ఉండగా బుడమేరు రూపంలో పంట పూర్తిగా కొట్టుకుపోయింది. తీవ్రంగా నష్టపోయాం. ప్రస్తుతం ఎకరాకు రూ.15వేలకు పైగా ఖర్చు చేసి నాట్లు వేశాం. పంట పొలాలు ముంపునకు గురి కాకుండా ప్రభుత్వం కాపాడాలి.

– పుట్టి నాగేశ్వరరావు, రైతు, ఒద్దుల మెరక గ్రామం, నందివాడ మండలం

గత ఏడాది పంట కోల్పోయాం



కొద్ది రోజులగా కురుస్తున్న వర్షాలతో బుడమేరులో ప్రవాహం రోజురోజుకీ పెరుగుతోంది. మరికొన్ని రోజులు వర్షాలు కురుస్తాయని అధికారులు చెబుతున్నారు. ఆ మాట వింటేనే గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. గత ఏడాది బుడమేరు వలన ఆస్తి, పంట కోల్పోయాం. నష్టపరిహారం కూడా రాలేదు. ఈసారి అయినా మమ్మల్ని కాపాడండి.

– ఎ.ఆనందరావు, రైతు, ఎల్ఎన్‌పురం, నందివాడ మండలం

చంద్రయ్య డ్రెయిన్‌లో పూడికతీత పనులు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్

పమిడిముక్కల: వరద ముంపులో వరిపొలాలు అని శుక్రవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించా. చంద్రయ్య డ్రెయిన్ పిచ్చిమొక్కలు, ముళ్లపొదలతో పూడిపోయి ఉండటంతో మురుగు పోయే మార్గం లేక గురజాడ, ఉయ్యూరు పరిధిలోని వందలాది ఎకరాలు ముంపునకు గురయ్యాయి. కొద్ది రోజులుగా నాట్లు వేసిన పొలాలు నీటిలోనే నానుతున్నాయి. దీనిపై సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించారు. పొక్లెయిన్ ఏర్పాటు చేసి చంద్రయ్య డ్రెయిన్‌లో పూడికతీత పనులు ప్రారంభించారు.



చంద్రయ్య డ్రెయిన్‌లో పొక్లెయిన్‌తో పూడికతీత పనులు చేస్తున్న దృశ్యం

పుల్లేరులో గుర్రపుడెక్క తొలగింపు

పమిడిముక్కల: గుర్రపుడెక్క తొలగించరూ! అని సాక్షిలో ఈ నెల 16వ తేదీన ప్రచురితమైన వార్తకు స్పందన లభించింది. పుల్లేరు కాలువలో మంటాడ శివాలయం, వెంకటేశ్వరస్వామి ఆలయం, గురజాడ వంతెన వద్ద గుర్రపుడెక్క అల్లుకుపోయింది. సాగునీటి ప్రవాహానికి అడ్డంకిగా మారిందని వార్త ప్రచురింతమైంది. దీంతో ఇరిగేషన్ అధికారులు డ్రోన్ల ద్వారా మందు పిచికారీ చేయగా, గుర్రపుడెక్క ఎండిపోయింది. ఎండిపోయిన గుర్రపుడెక్కను కాలువలో నుంచి తొలగించాలని మళ్లీ వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు పొక్లెయిన్ ఏర్పాటు చేసి కాలువలోని గుర్రపుడెక్కను తీసి గట్టుపై వేస్తున్నారు. నీటి ప్రవాహానికి అడ్డంకి లేకుండా చర్యలు చేపట్టారు.



మంటాడ శివాలయం వద్ద గుర్రపుడెక్కను తీసి గట్టుపై వేసిన దృశ్యం

కాలువల్లో గుర్రపుడెక్క తొలగింపు

కైకలూరు: పంట కాలువల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క తొలగింపు పనులను పలు మండలాల్లో డీసీ అధ్యక్షులు యుద్ధప్రాతిపాదికన శుక్రవారం చేయించారు. కైకలూరు మండలం వదర్లపాడు నుంచి పల్లెవాడ, వదర్లపాడు నుంచి సీతనపల్లి, కలిదిండి మండలంలో చినతాడినాడ నుంచి కొండూరు వరకు, గుర్వాయిపాలెం నుంచి కొండంగి వరకు తూడు, డెక్కను తొలగించారు. డీసీ చైర్మన్లు పొత్తూరి వాసురాజు, ముద్దం భోగేశ్వరరావు, శీతనపల్లి నీటి సంఘ అధ్యక్షుడు కట్టా రమేష్, డ్రెయినేజీ డీఈఈ శిరిష పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసుల పంపిణీ

కైకలూరు: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం నిమిత్తం రూ.10 వేలు విలువ చేసే ప్లేట్లు, గ్లాసులను గోపవరానికి చెందిన దాత దాసరి శేషగిరిరావు అందించారు. శుక్రవారం హెచ్‌ఎం దానం ప్రసాద్ ఆధ్వర్యంలో వీటిని విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా దాతను పాఠశాల సిబ్బంది సత్కరించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



కైకలూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

కైకలూరు: రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతి ఒక్కరూ అపోహలు వీడి రక్తదానం చేయడానికి ముందుకు రావాలని వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీలత కోరారు. తలసేమియా రోగుల అవసరార్థం ఏలూరు రెడ్ క్రాస్ సొసైటీ, కళాశాల యూత్ రెడ్ క్రాస్ అసోసియేషన్, ఎన్ఎస్ఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో మొత్తం 50 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కళాశాల యూత్ రెడ్ క్రాస్ కన్వీనర్ డాక్టర్ ఎం.హరిప్రసాద్, ఏలూరు యూత్ రెడ్‌క్రాస్ పీఆర్‌ఓ కేవీ రమణ, మానవతా సంస్థ సభ్యులు పి.వేణుగోపాలకృష్ణ, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ అడపా కేదారి, అధ్యాపకుడు కె.రమేష్ పాల్గొన్నారు.

సొసైటీ బాధ్యతలు చేపట్టిన ప్రకాష్



చినముత్తేవి(మొవ్వ): మొవ్వ మండలం చినముత్తేవి పీఏసీఎస్ అధ్యక్షుడిగా కొసరాజు ప్రకాష్ మాధుర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. త్రిమాన్ కమిటీలో డైరెక్టర్లుగా మురారి శివ నాగరాజు, సుంకర వెంకటేశ్వరరావు బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లింగమనేని రామలింగేశ్వర రావు, వీరంకి తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.

శ్రావణలక్ష్మిగా అమ్మవారు



మొవ్వ: మండలంలోని పలు గ్రామాల్లో శ్రావణ శుద్ధ పాడ్యమి శుక్రవారం రావడంతో ఆలయాలు మహిళా భక్తులతో కళకళలాడాయి. కూచిపూడి శ్రీ గంగా బాలత్రిపుర సుందరి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు శ్రావణ లక్ష్మిగా దర్శనమిచ్చారు. అర్చకుడు పెనుమూడి పూర్ణచంద్రశేఖరశర్మ ఆలయ పాలకమండలి సూచనలతో బంగారు పుష్పాలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

న్యాయవాదుల పరిరక్షణ చట్టం చేయాలి

విజయవాడలీగల్: రాష్ట్రంలో న్యాయవాదుల పరిరక్షణ చట్టం చేయాలని, న్యాయస్థానంలో ఖాళీగా ఉన్న న్యాయమూర్తులు, పబ్లిక్ ప్రాసిక్యూషన్ పోస్టులు భర్తీ చేయాలని కోరుతూ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సివిల్ కోర్టుల ఎదుట నిరసన ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఐఏఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి చలసాని అజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నూతన కోర్టు భవనాలు నిర్మించాలని కోరారు. న్యాయమూర్తుల సంక్షేమ నిధి రూ. 6 నుంచి రూ. 10 లక్షలకు పెంచాలని, మరణించిన న్యాయవాదుల కుటుంబాలకు ఇవ్వాల్సిన మ్యాచింగ్ గ్రాంటు బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పేదరికంలో ఉన్న న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, అలాగే హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు. బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ బాషా పాల్గొని న్యాయవాదులు చేపట్టిన కార్యక్రమాలకు వెన్నంటి ఉంటామని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఐఏఎల్ ఉప ప్రధాన కార్యదర్శి ఎంఏ షరీఫ్, ఉపాధ్యక్షులు కేవీవీ పరమేశ్వరరావు, కేఎస్ సుధాకరరాజు, కోశాధికారి బోను జయమ్మ, సహాయ కార్యదర్శి ఈఎస్ ప్రసాద్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

చెస్, షటిల్ పోటీలు ప్రారంభం



క్రీడలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ టౌన్: స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో కఠారి శ్రీనివాసరావు మెమోరియల్ చెస్, షటి ల్ బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన షటిల్ బ్యాడ్మింటన్ టీమ్‌లు, 170 మంది చెస్ క్రీడాకారులు ఈ పోటీలో పాల్గొన్నట్లు స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు తెలిపారు. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము చెస్ ఆడి క్రీడలు ప్రారంభించారు. చెస్ పోటీల్లో అండర్–9, అండర్–11, అండర్–13, అండర్–15, షటిల్ బ్యాడ్మింటన్‌లో అండర్–13, అండర్–15 సింగిల్స్, డబుల్స్ పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కె. రంగప్రసాద్, మున్సిపల్ మాజీ చైర్మన్ లంకదాసరి ప్రసాదరావు, సభ్యులు కె. రామ్‌కుమార్, ఎం. లక్ష్మణరావు, సీహెచ్ జగన్మోహనరావు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో వసతులు పెంచండి

గుడివాడ టౌన్: ఆర్టీసీ డిపోలో వసతులు పెంచాలని జిల్లా ప్రజా రవాణా సంస్థ అధికారి కె. వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం స్థానిక రాజేంద్రనగర్‌లోని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము నివాసంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. డిపోలో నూతన డీజిల్ బంక్ ఏర్పాటు, బస్టాండ్ నిర్మాణం, కొత్త బస్సులు తదితర అంశాలపై ఎమ్మెల్యేతో చర్చించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి కావాల్సిన ఏర్పాట్లపై చర్చ జరిగినట్లు డిపో మేనేజర్ తెలిపారు.

రేపటి నుంచి వార్షిక ఆగమన మహోత్సవాలు

పమిడిముక్కల: మంటాడ శ్రీ అలివేలుమంగా సమేత వైకుంఠ వెంకటేశ్వరస్వామి, శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు వార్షిక ఆగమన మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈఓ దుర్గా నాగేశ్వరరావు పేర్కొన్నారు. 27న మూలవరులకు అష్టోత్తర శతకలశాభిషేకం, 28న లక్ష్మి తులసి పుష్పాలతో అర్చన, 29న మూలవరులకు నవకలశాభిషేకం, మధ్యాహ్నం 12 గంటలకు సమష్టి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ



మండవల్లి: మండవల్లి, కైకలూరు డివిజన్ల పరిధిలోని వీఏఏలకు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో ఏడీఏ జి.వెంకటమణి ఆధ్వర్యంలో లింగాల, అల్లినగరం గ్రామాల్లో శిక్షణ ఇచ్చారు. ఏ గ్రేడ్ మోడల్స్, ఏటీఎం మోడల్స్ సందర్శన, గ్రౌండింగ్, అల్లినగరంలో గౌతమ్ న్యాచురల్స్ అండ్ ఆర్గానిక్స్ ప్రకృతి వ్యవసాయ వనరుల ఉత్పత్తుల కేంద్రం వద్ద కషాయాలు, ద్రావణాల తయారీ విధానాన్ని చూపించి వివరించారు. ముదినేపల్లి, కైకలూరు ఏఓలు వెంకటేష్, దివ్య, ఏఏ మధుబాబు, మాస్టర్ ట్రైనర్ అగస్టిన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పామర్రు(మొవ్వ): వైఎస్సార్ సీపీని బలోపేతం చేసేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని, కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న అప్రజాస్వామ్య పాలనను, చేస్తున్న మోసాలను ఎండగట్టాలని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు. శుక్రవారం పామర్రులోని బొమ్మారెడ్డి సీతారెడ్డి కల్యాణ మండపంలో మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి జగన్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 98 శాతం హామీలు నెరవేర్చి తన చిత్తశుద్ధిని చాటుకున్నారన్నారు. కూటమి నాయకులు అధికార దాహంతో అమలుకు సాధ్యం కాని హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేశారన్నారు. ఎన్నికల ముందు ఒక మాట, ఎన్నికల తరువాత ఒక మాట మాట్లాడి విద్యార్థులను, రైతులను, మహిళలను మోసం చేశారన్నారు. 'ఆడబిడ్డ నిధి కోసం రాష్ట్రాన్ని అమ్మాలి' అని మంత్రి అచ్చం నాయుడు మాట్లాడటం ఆడబిడ్డలను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. సోమవారం నుంచి బాబు షూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని ఎలకుర్రు నుంచి ప్రారంభిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో నాయకులు ఐక్యంగా పనిచేసి, కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కాకార్ల వెంకటేశ్వరరావు, ఎంపీపీ దాసరి అశోక్ కుమార్, వైస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, రమాదేవి, సర్పంచ్ పీ కస్తూరి, జిల్లా ట్రేడ్ యూనియన్ విభాగం అధ్యక్షుడు తాడిశెట్టి శ్రీనివాసరావు, మండల కో–ఆప్షన్ సభ్యులు హష్మతుల్లా, వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు పుట్టి కిషోర్, మండల ప్రధాన కార్యదర్శులు పెయ్యల రాజు, కొడాలి సురేష్ బడుగు నాగరాజు నాయకులు ప్రాకర్ల నాగరాజు, కలపాల నాగరాజుతో పాటు పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

అధికారమే లక్ష్యంగా పని చేయండి



పదవులు పొందిన నాయకులను సన్మానించిన డీఎన్నార్

కైకలూరు: కూటమి ఏడాది పాలనపై ఇప్పటికే ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, పార్టీ కార్యకర్తలు రానున్న ఉన్నికల్లో వైఎస్సార్ సీపీ అధికారమే లక్ష్యంగా పని చేయాలని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) పేర్కొన్నారు. నూతనంగా జిల్లా అనుబంధ విభాగ కమిటీల్లో కైకలూరు మండలానికి సంబంధించిన 22 మంది ఎన్నికైన సభ్యులను కైకలూరు పార్టీ కార్యాలయంలో డీఎన్నార్ శుక్రవారం ఘనంగా సన్మానించారు. వీరిలో అబ్దుల్ మాలిక్, పడమట శేషావతారం, సాదు కొండయ్య, షేక్ రఫీ, దోమ భాగ్యరాజు, జంగం మధుసుందరబాబు(మధు), కేతలి పార్థసారథిరెడ్డి, తోట మహేష్, తమ్మిశెట్టి లక్ష్మీ, బందెల లక్ష్మణరావు, శాఖమూరి అమన్న రాజా, దాసరి సుధాకర్‌రావు, మనిమెల రాజేష్, బలే వెంకట అశోక్, బండి ప్రసాద్, కన్నా రమేష్, భాష్యం సత్యనారాయణ, యాళ్ల కృష్ణ, పంజా రామారావు, సోమాల శ్యాంసుందర్, షబ్బీర్, పాలపర్తి సద్గుణరావు ఉన్నారు. తమకు పదవులు కేటాయించిన పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సింగంశెట్టి రాము, నాయకులు సమయం రామాంజనేయులు, గాలిబ్‌బాబు, బుర్ల కిరణ్, పెంటా అనిల్‌కుమార్, షాబుద్దీన్ పాల్గొన్నారు.

వర్షం నీరు నిల్వ లేకుండా చర్యలు

గుడివాడరూరల్: అల్పపీడన ప్రభావంతో కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలతో నీరు నిల్వ చేరకుండా ఎప్పటికప్పుడు గ్రామంలో డ్రెయినేజీ పూడిక తీత పనులు చేపట్టినట్లు మల్లాయపాలెం పంచాయతీ కార్యదర్శి కోటయ్య తెలిపారు. గ్రామంలో శుక్రవారం జరుగుతున్న డ్రెయినేజీ పూడిక తీత పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రత్యేకాధికారి, ఎంపీడీఓ బీవై విష్ణు ప్రసాద్ ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు డ్రెయినేజీ పూడిక తీత పనులు చేపడుతూ వర్షం నీరు నిల్వ లేకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.